ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం

వ్యయ ప్రయాసల మధ్య సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి కింద అందించే రూ.13,750, మూడో విడత కింద జమ చేయాల్సిన రూ.రెండు వేలు ఇప్పటివరకూ జమ చేయలేదని విమర్శించారు. ఈ మేరకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, కార్యదర్శి ఆకుల హరే రామ్ , జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులతో పోలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇస్తున్న రూ.13,750 సరిపోదని, రైతు ప్రభుత్వంగా చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా రైతుల ఖాతాలో రూ.2000 జమ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందించాలని కోరారు.

యలమంచిలిలో కోడిపందేల బరి వద్ద జనం

పాలకొల్లు రూరల్: పందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

జోరు.. బేజారు..!

పెద్ద బరుల వద్ద పందేల హుషారు..

ఖాకీల రాకతో చిన్న బరుల వద్ద పరేషాన్

ఆదివారం నుంచి నిలిచిన గుండాట, ముక్కలాట, ఇతర జూదాలు

మూడో రోజు కానరాని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు

చేతులు మారిన రూ.250 కోట్లు

ప్రజాశక్తి - భీమవరం

రెండు జిల్లాల్లో కోడిపందేలు మూడోరోజు సోమవారం కొనసాగాయి. మొదటి రోజు కోడిపందేలతోపాటు గుండాట, కోతాట వంటివి యథేచ్ఛగా సాగగా రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి కోడిపందేలు మినహా మిగిలిన అన్నింటినీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ దశలో పందేలు కూడా ఆగుతాయా అనే చర్చ సాగింది. దీంతోపాటు ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలను కూడా పోలీసులు అడ్డుకోవడంతో సోమవారం ఉదయమే పందేలు ప్రారంభమయ్యాయి. గుండాట వంటివి ప్రారంభించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.

మొగల్తూరు : కోడిపందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలి, యలమంచిలి మండలం కలగడంపూడి, భీమవరం రూరల్, ఆకివీడు మండలాల్లో వేసిన బరుల్లో పందేలు లక్షల్లో సాగాయి. ఏలూరు జిల్లాలో కొన్నిచోట్ల పందేలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. అయితే ప్రధాన బరుల జోలికి పోలీసులు వెళ్లలేదని విమర్శలు వెల్లువెత్తాయి. ఉంగుటూరు మండలంలో అధికార పార్టీ నేతలకు చెందిన బరుల్లోకి, జిల్లాలోని పెద్ద బరుల వద్దకు పోలీసులు వెళ్లిన దాఖలాల్లేవు. అయితే మిగిలిన గ్రామాల్లోని చిన్నచిన్న బరులపై దాడులు చేసి గుండాట వంటి వాటిని పూర్తిస్థాయిలో అడ్డుకున్నారు. పందేలను కొన్ని చోట్ల ఆపించగా అధికార పార్టీ నేతల జోక్యం ఉన్న చోట్ల చూసీచూడనట్లు వదిలేశారు. ఆదివారం ఉదయం నుంచి గుండాట వంటివి అడ్డుకోవడం, ఏలూరు జిల్లాలో కొన్నిచోట్ల పందేలను సైతం అడ్డుకోవడంతో ప్రముఖులు, నేతలు సైతం సోమవారం పందేలకు దూరంగా ఉన్నారు. బరుల వద్దకు వెళ్లే నిర్వాహకులు గుండాట వంటివి ఆపేయడంపై ప్రశ్నించే అవకాశం ఉండటం, ప్రసార మాధ్యమాల్లో కన్పిస్తే హైకోర్టు సుమోటాగా కేసులకు ఆదేశాలు జారీ చేసి విచారించే అవకాశం ఉందనే కారణంతో ప్రజాప్రతినిధులు బరులకు దూరంగా ఉన్నట్లు ప్రచారం సాగింది. ఏదేమైనా ఈ మూడు రోజుల్లో పందేల రూపంలోనే రూ.250 కోట్లకుపైగా చేతులు మారినట్లు సమాచారం.

మొగల్తూరు:సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గత మూడు రోజులుగా కోడిపందేలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని మొగల్తూరు, పేరుపాలెం, కెపి.పాలెం, ముత్యాలపల్లి, మోడీ, వారతిప్ప, కాళీపట్నం, జగన్నాథపురం, పాతపాడు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో లక్షల రూపాయలు చేతులు మారాయి. బరుల వద్ద పందెం రాయుళ్ల కోసం కూల్ డ్రింక్ షాపులు, పలావ్ సెంటర్లు నెలకొల్పారు.

పెనుమంట్ర:మూడో రోజు కనుమ సందర్భంగా కోడిపందేలు యథావిధిగా కొనసాగాయి. ప్రధానంగా మండల పరిధిలోని మాముడూరు, జుత్తిగ, నత్తారామేశ్వరం, ఆలమూరు గ్రామాల్లో కోడిపందేలు అంతంతమాత్రమే జరిగాయి. భోగి రోజున పందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి ఆదివారం గుండాటను పోలీసులు ఆపేశారు. వీటి ప్రభావంతో ఒకవైపు మాంసం దుకాణాల విక్రయాలు తగ్గు ముఖం పట్టడంతో బరిలోకి వచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు కూడా అంతంత మాత్రమే జరిగాయి.

ఆకివీడు : దుంపగడపలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కోడిపందేలు కొనసాగాయి. సోమవారం గత రెండు రోజుల కంటే జనాభా పెరగడం గమనార్హం. మండలంలో గతంలో పోలిస్తే ఈ సారి కోడిపందేల జోరు బాగా తగ్గిందని అనుకుంటున్నారు. రెండు మూడు పందేలు మినహా పెద్దగా చెప్పుతగ్గ పందేలు లేవని చెబుతున్నారు.

తాడేపల్లిగూడెం : మండలంలో కోడిపందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి సందర్భంగా పెద్దతాడేపల్లి, చినతాడేపల్లి, కొమ్ముగూడెం, పట్టెంపాలెం, మారంపల్లి, మోదుగుంట, గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి నిర్వాహకులు కోడిపందేలు నిర్వహించారు. జనం భారీగా పందేల్లో పాల్గొన్నారు. కోట్లాది రూపాయలు ఈ సందర్భంగా చేతులు మారాయి.

యలమంచిలి : సంక్రాంతి సాంప్రదాయ ముసుగులో మూడు రోజులుగా మండలంలోని కలగంపూడి, కాజ, కొంతేరు, యలమంచిలి, మేడపాడు, కట్టుపాలెం, కనకాయలంక, పెదలంక, బూరుగుపల్లి, గుంపర్రు, మట్లపాలెం తదితర గ్రామాల్లో కోడిపందేలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకూ నిరాటంకంగా కొనసాగాయి. మొదటిరోజు కోడిపందేలతో పాటు గుండాట, పేకాట జరిగినా చూసీ చూడనట్లు వ్యవహరించిన పోలీసు యంత్రాంగం చివరి రోజు మాత్రం పేకాట, గుండాటలను పూర్తిగా నిర్మూలించ గలిగారు. దీంతో మధ్యాహ్నం నుండే కొంతమంది జూదరులు, వీక్షకులు నిరాశతో వెనుదిరిగారు. దీంతో బరుల వద్ద కొంత హడావుడీ తగ్గింది. అయితే ఒక్క యలమంచిలిలో మాత్రం నిర్వాహకులు బరుల వద్దకు వచ్చే జనాలకు మూడు రోజులూ కూడా ఉదయం అల్పాహారం నుండి మధ్యాహ్నం, సాయంత్రం రెండు పూటలా సుమారు 1500 మందికి మూడు రకాల నాన్ వెజ్, వెజ్ భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ కల్చరల్ ప్రోగ్రామ్స్, గేమ్స్ నిర్వహించి ప్రైజ్ మనీ గిఫ్టులు ఇవ్వడంతో అక్కడికి ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు,

గుండాట, పేకాటకు మూడు రోజులు పర్మిషన్ ఉంటుందని అత్యాశతో రూ.లక్షలు ఖర్చుపెట్టి భోజనాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు చివరికి భారీ నష్టం రావడంతో లబోదిబోమంటున్నారని పలువురు చెప్పుకుంటున్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని పూలపల్లి, శివదేవుని శిక్కాల, వడ్లవాని పాలెం, గ్రామాల్లో కోడి పందేలు సోమవారం కూడా జోరుగా సాగాయి. అయితే గుండాట, పేకాట వంటి క్రీడలను ఆపేయడంతో జూదరులు నిరాసపడ్డారు. ఈ మూడు రోజుల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయని పలువురు అంటున్నారు. దీనికితోడు బరుల వద్ద మద్యం ఏరులై పారింది. గుండాట వేయలేకపోవడంతో బరుల వద్ద జనాల తాకిడి తగ్గింది. దీంతో వ్యాపారం తగ్గి వ్యాపారస్తులు దిగాలు పడ్డారు.

పండుగ వేళ కూరగాయాలు'

ప్రజాశక్తి - పాలకొల్లు

విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

సంక్రాంతి సందర్భంగా అన్ని నిత్యావసర వస్తువుల ధరలతో పాటు స్వీట్లు, కేకులు, చివరకు కూరగాయాల ధరలు సైతం పెరిగాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. సంక్రాంతికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా కాయగూరల కోతలకు కూలీలు రాకపోవడంతో టమాటా నుంచి అన్ని కాయగూరల ధరలు పెరిగాయి. పండగ ముందు కిలో రూ.20 ఉన్న టమాటా ప్రస్తుతం రూ.30కు చేరింది. బంగాళదుంపలు కిలో రూ.20 నుంచి రూ.30లకు, వంకాయలు కిలో రూ.45 నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.60లకు విక్రయిస్తున్నారు. కోడిగుడ్డు ధర కూడా పైపైకి ఎగబాకుతోంది. హోల్‌సేల్‌లో 6.25 రూపాయలు ఉండడంతో రిటైల్‌గా రూ.7 అమ్ముతున్నారు.

200 రకాలతో అల్లుడికి విందు

ప్రజాశక్తి - మొగల్తూరు

అతిథి మర్యాదలకు పెట్టింది పేరు ఉభయగోదావరి జిల్లాలు. మండల కేంద్రం మొగల్తూరు గ్రామానికి చెందిన అనంతపల్లి ఫణి, ఝాన్సీ దంపతుల ప్రథమ కుమార్తె లక్ష్మీ హరిప్రియను భీమవరం పట్టణానికి చెందిన వబిలిశెట్టి వినయ్‌తో వివాహం చేశారు. సంక్రాంతి పండుగకు వచ్చిన అల్లుడు వినయ్‌కు ఫణి దంపతులు పలు రకాల స్వీట్లు, పండ్లు, శీతల పానీయాలు, పిండివంటలు కలిపి సుమారు 200 రకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు.

200 రకాల పిండివంటలతో కొత్త అల్లుడికి విందు

పట్టింపాలెంలో ట్రాక్టర్ల పందేలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని పట్టింపాలెం గ్రామంలో ట్రాక్టర్ పందేలు సోమవారం నిర్వహించారు. పట్టింపాలెం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం గ్రామాల మధ్య ట్రాక్టర్ పందేలు నిర్వహించారు. రెండు ట్రాక్టర్లకు మధ్యలో మోగు బిగించి ఏ ట్రాక్టర్ అయితే బలంగా అవతలి ట్రాక్టర్ లాగుతుందో ఆ ట్రాక్టర్ పందెంలో గెలిచినట్లు ప్రకటిస్తామని పందేల నిర్వాహకులు తెలిపారు. యువత కోడిపందేలు, జూదం, గుండాట జోలికి పోకుండా ఉండేలా ఈ పందేలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ట్రాక్టర్ల పోటీలు

సంధ్యా సమయాన ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి - వీరవాసరం

యువత అభిరుచికి తగ్గగట్టుగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు అనుకున్నది సాధిస్తారని రాష్ట్ర సాంస్కృతిక నాటక కళాపరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దా వెంకట్రామయ్య అన్నారు. వికె మీడియా ఎంటర్‌ట్రైన్‌మెంట్ వారి సంధ్యా సమయాన షార్ట్‌ఫిల్మ్ ట్రైలర్, పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక కళాపరిషత్ సమాఖ్య సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకట్రామయ్య మాట్లాడుతూ సమాజం హితం కోరి చెప్పాలనుకున్నది షార్ట్ ఫిల్మ్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సందేశాన్ని చెప్పే అవకాశం ఉంటుందన్నారు. రెండున్నర గంటల సినిమా కథను పదిహేను నిమిషాల వ్యవధిలో చెప్పడం కత్తిమీద సాములాంటిదన్నారు. వికె మీడియా ఎంటర్‌ట్రైన్‌మెంట్ వ్యవస్థాపకులు కూనపరెడ్డి వినయ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నూతన నటీనటులకు అవకాశ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్‌కు నిర్మాతలుగా కూనపరెడ్డి జయరాజు, జయలక్ష్మీ వ్యవహరించారన్నారు. అనంతరం ట్రైలర్‌ను బుద్దా వెంట్రామయ్య, పోస్టర్‌ను ఎపి సాంస్కృతిక కళా పరిషత్ సమాఖ్య కార్యదర్శి జవ్వాది దాశరథి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, వీరవాసరం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, వీరవాసరం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాటక రంగ పెద్దలు

ప్రజా సంఘాల ఆధ్వర్యాన ముగ్గులు, ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆచంట

సాంప్రదాయ, గ్రామీణ క్రీడలను విద్యార్థులు, యువత పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అన్నారు. సంక్రాంతి యువజనోత్సవాల సందర్భంగా డివైఎఫ్ఐ, జై భీమ్ యువజన సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి ఆటల పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పెనుమంచిలి వర్ధనపుగరువు అంబేద్కర్ సర్కిల్ వద్ద గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ క్రీడలకు, పేకాట, గుండాట, కోడిపందేలు తదితర జూద క్రీడలకు బానిసలౌతున్నారన్నారు. యువత, విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం కోసం ఆటల్లో భాగస్వాములు కావాలన్నారు. డివైఎఫ్ఐ, జైభీమ్ యువజన సంఘాలు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు ఎస్ఐ ప్రసాద్, పెనుమంచిలి గ్రామ సర్పంచి గణేశుల శేషవాణి, మాజీ సర్పంచి వర్ధనపు నవమోహిని బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సిర్రా నర్సింహమూర్తి, మానుకొండ రాంబాబు, జైభీమ్ యువజన సంఘం నాయకులు అల్లూరి చిన్నారావు, వర్ధనపు హరికృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు వర్ధనపు నాగేశ్వరరావు, సిర్రా విఘ్నేశ్వరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భీమలాపురం వాకర్స్ క్లబ్ శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా మండల అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల అన్నారు. భీమలాపురంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త వెంకటేశ్వరరావు వెంకటలక్ష్మి శ్రీదేవి సంధ్య పాల్గొన్నారు.

యలమంచిలి : చించినాడలో మూడు రోజులుగా ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం శెట్టిబలిజపేట, పెదపేట, సోమవారం ఆర్లపాడు, విప్పర్తివారి పేటలో మహిళలకు ముగ్గులు పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ ఛైర్స్, కుండ కొట్టిడి, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు సరిపల్లి జయప్రద మాట్లాడుతూ విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ముస్కుడి జయశ్రీ, కానేటి ప్రియాంక, మురాల ఝాన్సీ, సెట్టిమి నాగమణి, బుంగ విజయ, వీరమల్ల లక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు : క్రీడా పోటీలు యువతకు ఉత్తేజాన్ని, ఆరోగ్యాన్ని భవిష్యత్‌ను అందిస్తాయని సిఐ గీతా రామకృష్ణ అన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీలను ఆదివారం రామకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. ఈ క్రీడా పోటీలు ఆహ్లాదకర వాతావరణంలో సాగుతున్నాయి. సోమవారం చెడుగుడు పోటీల్లో 13 టీములు పాల్గొన్నాయి. కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల్లో 30 టీంలు పాల్గొన్నాయి. రాష్ట్రస్థాయి మహిళా ఆహ్వాన వాలీబాల్ పోటీలలో 5 టీమ్‌లు పాల్గొన్నాయి. సోమవారం రాత్రి ఫ్లైట్ లైట్లు మహిళ వాలీబాల్ పోటీలు ప్రారంభించారు.

పోడూరు : సంక్రాంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో మొదటి బహుమతి గుబ్బల నవదీప్, రెండో బహుమతి బూరాబత్తుల మోహన్, మూడో బహుమతి దొమ్మేటి ప్రసాద్ సాధించారు. మహిళల విభాగంలో మొదటి బహుమతి శెట్టిబత్తుల దివ్య, రెండో బహుమతి తాడి ఋషిత, మూడో బహుమతి చెల్లుబోయిన రిషిత గెలుపొందారు. ఈ కార్యక్రమంలో పిల్లి ప్రసాద్, బోంతు శ్రీను, బురాబత్తుల వెంకట్రావు, కాకర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుమంచిలిలో విజేతలకు బహుమతులందజేస్తున్న ఎస్ఐ ప్రసాద్

ఆకివీడులో నిర్వహిస్తున్న చెడుగుడుపోటీలు

పెంటపాడు : డివైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పెంటపాడు వెలమపేట సంఘం మేడ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతి అడపా బిందు శ్రీవాణికి సిరపరపు రంగారావు అందజేశారు. రెండో బహుమతి ఎస్.పుష్పకు కిలపర్తి వెంకట్రావు అందజేశారు. మూడో బహుమతి ఉజ్వల లక్ష్మికి చల్లా చంద్రరావు అందజేశారు. అలాగే మ్యూజికల్ ఛైర్స్, సైక్లింగ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, దేవరపల్లి అప్పారావు, సిరపు విష్ణు, కరక వెంకట్రావు పాల్గొన్నారు.

పెనుమంట్ర : బ్రాహ్మణచెరువులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు, పురుషులకు వాలీబాల్ పోటీలు, చిన్నారులకు మ్యాజిక్ ఛైర్స్ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బి.విజయ్ కుమార్, రైతు సంఘం నాయకురాలు సిహెచ్.లక్ష్మీ కుమారి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ, మహిళా సంఘం నాయకురాలు రాణి, చింతపల్లి ఆదినారాయణ, కె.శాంతి, రమావతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం:కోడిపందేలు, జూదం వంటి క్రీడలకు యువత దూరంగా ఉండాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చట్ల త్రిమూర్తులు పిలుపునిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో 22వ వార్డులో మహిళలకు ముగ్గులు పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్తిబాబు బి.జోగేశ్వరరావు, వాసా రామలింగం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సంక్రాంతిని పురస్కరించుకుని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని భాగ్యలక్ష్మీపేట 19వ వార్డులో సంతాన గణపతి ఆలయం వద్ద మహిళలకు ముగ్గులు పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ రాష్ట్ర నాయకులు వర్తనపల్లి కాశీ విశ్వేశరరావు, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, డివైఎఫ్ఐ నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీనివాసు మాట్లాడారు. యువత చెడు మార్గాలవైపు మళ్లకుండా ఉండడానికి డివైఎఫ్ఐ, సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జవాది శ్రీను, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, తోటి శ్రీను, మక్కా రాజు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా డివైఎఫ్ఐ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో మాధవరం, ఇటుకలకుంటలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న కోడిపందేలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆటల పోటీలకు ప్రజల నుండి మంచి స్పందన వస్తోందన్నారు. మాధవరంలో జరిగిన ముగ్గుల పోటీల్లో మంచాల అమ్ములు, కె.పావని, ఎం.బ్లేస్సీ, ఇటుకలగుంటలో జరిగిన ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానం గోకనబోయిన లలిత, రెండో స్థానం హారిక, మూడో స్థానం గోకన్న బోయిన సుబ్బరాజు సాధించారు. మాధవరంలో జరిగిన కుర్చీల పోటీల్లో ఇండిగ మల్లి సంజన, కొడవటి అశ్విని ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. ఇటుకలగుంటలో జరిగిన బాల బాలికలకు పరుగు పందెం పోటీల్లో ఎం.విజయ, ఎం.హేమంత్‌కుమార్, చిటికెన బోయిన తేజ, ఆర్.ప్రసన్నకుమార్, కోరసిక హర్షిత, గుడ్ల సాయి నీరజ, ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రజాసంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాలుపూరి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కండెల్లి సోమరాజు, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు పాలుపూరి సత్యవతి, పి.జయమ్మ, ఎస్.చిన్ని, మెతుకు మెల్లి చింతారావు, మల్లిపూడి మహాలక్ష్మి, పాసించిన పెద్దిరాజు, మాగంటి చింతారావు, పాల్పురి శ్రీనివాసు, లాయి కృష్ణ బహుమతులు అందజేశారు.

పెనుమంట్ర : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండో రోజు కూడా మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో మాట్లాడారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామీణ క్రీడలను అలవర్చుకోవాలని ఉద్దేశంతో 35వ సంక్రాంతి యువజన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, డివైఎఫ్ఐ గ్రామ కమిటీ సభ్యులు పి.దుర్గాప్రసాద్, చింతపల్లి భారతి, కేతా ప్రమోద్, ఫణీంద్ర పాల్గొన్నారు.



పాలకొల్లులో చేగొండి అనంత శ్రీరామ్, బుర్ర సాయి మాధవ్‌ను సత్కరిస్తున్న నిమ్మల రామానాయుడు

ప్రజలను కలుపుకుని వెళ్లేవాడే నాయకుడు

గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్

ప్రజాశక్తి - పాలకొల్లు

నాయకుడంటే కలలు కనడం కాదు.. సామాన్య ప్రజలను కలుపుకొని వెళ్లడం అని సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ చెప్పారు. పాలకొల్లులో జరిగిన సంక్రాంతి సంబరాల ముగింపు సందర్భంగా తనకు చేసిన సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు. 2014లో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పదవి చేపట్టేందుకు ముందు పట్టణంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండేదని, పందులు, కుక్కలు విచ్చలవిడిగా తిరిగేవని అయితే మొత్తం పట్టాణంలో మారుమూల రోడ్డు కూడా బిసి రోడ్డుగా మార్చారని చెప్పారు. తన గేయ రచనలతో యువతను ఉర్రూతలూగించారు. ఇంకా ఆయనతోపాటు బ్లాక్ బాస్టర్ చిత్రాల మాటల రచయిత బుర్ర సాయి మాధవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రాలు వేరైనా స్నేహం కొనసాగిస్తాం

ఎంఎల్‌ఎ ప్రకాష్ గౌడ్

ప్రజాశక్తి - కాళ్ల

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా స్నేహం ఎప్పటికీ కొనసాగుతుందని రాజేంద్రనగర్ ఎంఎల్‌ఎ టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర నుంచి ఎంఎల్‌ఎ టి.ప్రకాష్‌గౌడ్ జక్కరంలో జరిగే కోడిపందేలను వీక్షించారు. సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు స్నేహితులతో కలిసి కోడిపందేలను వీక్షించారు. జక్కరం గ్రామ పెద్దలు ప్రకాష్ గౌడ్‌కు స్వాగతం పలికారు. కూచంపూడి సతీష్ వర్మ, ఎం.రమేష్‌రాజు, నంబూరి సతీష్‌రాజు ఎంఎల్‌ఎను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు కోడి పందేల సంప్రదాయం ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కరం ఉపసర్పంచి కూచంపూడి లక్ష్మి పతిరాజు, పి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ట్రస్టీ నరసింహారావు

పెద్దగోపురం అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థాన అన్నదాన ట్రస్ట్‌కు దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యులు అయినరెల్లి నరసింహారావు, లలిత, కుమారులు రూ.10,116లు సోమవారం విరాళం అందజేశారు. వీరికి ఆలయ ఛైర్మన్ శ్రీకోరాడ శ్రీనివాసరావు శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ యాళ్ల సూర్యనారాయణ, సూపరింటెండెంట్ నరసింహ స్వామి, ట్రస్టీలు పాల్గొన్నారు.

ధరణిజాకు నగదు అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

ఆకివీడు సెంటినరీ సెంట్రల్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన బైబిల్ పరీక్షలో కోపల్లే గ్రామానికి కొండేటి ధరణిజా మొదటి స్థానంలో నిలిచి పదివేల రూపాయల నగదు బహుమతిని సాధించింది. సోమవారం లూథరన్ చర్చిలో క్లబ్ ఛైర్మన్ బంటుమిల్లి సురేష్ కుమార్ 10 వేల రూపాయల నగదు అందజేశారు. క్రిష్టియన్ యూత్ క్లబ్ ఆఫ్ ఇండియా 2022 డిసెంబర్ 10న ఆకివీడు సెంటినరీ సెంట్రల్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన బైబిల్ పరీక్షకు నాలుగు జిల్లాల నుండి సుమారు వంద మంది బైబిల్ ప్రేమికులు హాజరయ్యారు. కాళ్ల మండలం కోపల్లే గ్రామానికి చెందిన కొండేటి ధరణిజా, ఆకివీడు మండలం కమతవానిగూడెం గ్రామానికి చెందిన చుక్కా నీలవేణి, తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామానికి చెందిన గిప్సన్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. రెండు, మూడు స్థానాల వారికి త్వరలో వాళ్ల ప్రాంతాలకు వెళ్లి నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఈ కార్య్రమానికి జిల్లా క్లబ్ ప్రెసిడెంట్ యేలేటి న్యూటన్, సిఆర్ దీనరాజు, పిసిసి బుంగా ఆదాము, తనుకుల జీవరత్నం పాల్గొన్నారు.

క్షత్రియ సమ్మేళనంలో మాజీ ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న సభ్యులు

ఏలూరుపాడులో క్షత్రియ సమ్మేళనం

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి పండుగ గురించి నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఏలూరుపాడులో సంక్రాంతి సందర్భంగా క్షత్రియ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతీ కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, దాట్ల శ్రీనివాసరాజు, (సెక్యూరిటీ వాస్), మంతెన రవివర్మ పాల్గొన్నారు.

వేడుకగా ప్రభల తీర్థం..

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంచిలిలో సోమవారం ప్రభల తీర్థం వేడుకగా నిర్వహించారు. కరుగోరుమిల్లి, కందరవల్లి, కోడేరు, వల్లూరు, పెనుమంచిలి గ్రామాల నుంచి వచ్చిన ప్రభలు తిరణాళ్లలో యాత్రికులకు దర్శనమిచ్చాయి. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు తరలివచ్చి ప్రభలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన వీరనాట్యం యాత్రికులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రభల తిరణాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆచంట ఎస్‌ఐ బిఎస్‌డి ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరణాళ్లలో ఆయా గ్రామాల సర్పంచులు గణేశుల శేషవాణి సుబ్బారావు, బోడపాటి బుల్లియ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు


శివదేవునిచిక్కాలో గుండాట శిబిరం

గుండాట నిర్వాహకులు అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు సోమవారం గుండాట నిర్వహిస్తున్న ప్రాంతాల్లో దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. శివదేవునిచిక్కాలలో గుండాటకు సంబంధించి బోర్డులు స్వాధీనం చేసుకున్నారు. వాలమర్రు గ్రామంలో గుండాట నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,420, బోర్డును స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గోదారి తీరాన.. సంక్రాంతి సందడి

బంధు మిత్రులతో గ్రామాలు కళకళ

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి వేడుకలను గోదావరి తీర ప్రాంతమైన ఆచంట మండలంలో ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్ల బంధువులు, స్నేహితులు పల్లెలకు పెద్ద ఎత్తున తరలి రావడంతో గ్రామాలన్నీ కళకళలాడాయి. ఇళ్లలో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ నూతన వస్త్రాలు ధరించి ఉల్లాసంగా గడిపారు. వీధులన్నీ రంగురంగుల ముగ్గులతో కళకళలాడాయి. డూడూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా వివిధ ఆలయాల్లో యాత్రికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు పశువుల కాళ్లకు గజ్జలు మెడలో రంగురంగుల పూలదండలు వేసి అందంగా అలంకరించి పూజించారు.

పెళ్లి కూతురమ్మ తిరణాళ్లకు పోటెత్తిన యాత్రికులు..

సంక్రాంతిని పురస్కరించుకుని ఆచంట, పెనుగొండ సరిహద్దుల్లో వెలసిన పెళ్లి కూతురమ్మ తిరణాళ్లు వేడుకగా సాగాయి. రెండు రోజులపాటు సాగిన తిరణాల్లో యాత్రికులు పెద్ద ఎత్తున పాల్గొని పెళ్లి కూతురుమ్మను దర్శించుకున్నారు. తిరణాళ్ల సందర్భంగా వ్యాపారులు పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటు చేశారు.

ఆహా.. అరిసెలు..

పెనుమంట్ర: సంక్రాంతి పండుగలో అతి ముఖ్యమైన రుచికరమైన పిండి వంట అరిసెలు. ఈ పండుగలో అరిసెలు వండని, రుచిచూడని వారుండరంటే అతిశయోక్తికాదు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. ఆ రోజుల్లో ప్రతి ఇంట్లో బియ్యం నానబెట్టి, రోకలితో దంచి ఆ పిండితో కుటుంబ సభ్యులు అందరూ ఒక చోట చేరి అరిసెలు వండేవారు. నేటి ఆధునికయుగంలో బియ్యాన్ని పెండిమిషన్‌లో ఆడించి అరిసెలు వేస్తున్నారు. ప్రస్తుతం స్వీట్ షాపుల్లో అరిసెలు రెడీమేడ్‌గా దొరుకుతున్నాయి. చాలా మంది ఇంత ప్రయాస పడకుండా వాటినే కొనుగోలు చేసి తింటున్నారు.

కళ తప్పిన కనుమ..!

చికెన్, మటన్ దుకాణాలు వెలవెల

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్రాంతి పండుగలో భాగంగా మూడో రోజు కనుమ పండుగ కళ లేదు. సోమవారం కావడంతో పాలకొల్లు నియోజకవర్గంలో చికెన్, మటన్ దుకాణాలు వెలవెలబోయాయి. కనుమ పండుగను లేబర్ హాలిడేగా ప్రకటిస్తారు. అయితే ప్రజల వద్ద సొమ్ములు లేకపోవడంతో పండుగ రోజుల్లో అమ్మకాలు అంతంతమాత్రమే ఉన్నాయి. కనీసం ఆదివారం ఉండే రద్దీ కూడా చికెన్, మటన్ షాపుల వద్ద లేకపోవడం విశేషం. సీట్ల షాపుల వద్ద కూడా అమ్మకాలు అంతంత మాత్రంగా ఉన్నాయంటే ప్రజల ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోంది.

వెలవెలబోతున్న చికెన్ దుకాణం

కోడిపందాలపై ప్రభావం..

సాధారణంగా కోడిపందేలు వద్ద సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉంటేనే జోరుగా ఆటలు సాగుతాయి. అయితే ప్రస్తుతం సొమ్మంతా దళారీలపాలు అవుతోంది. మద్యం వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్స్, బడా కాంట్రాక్టర్ల వద్ద సొమ్ము ఉంటోంది. గోదావరి జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బడా పారిశ్రామిక, వ్యాపార, పెద్ద ఉద్యోగస్తులే కోడిపందేలు ఆడుతున్నారు.

రొయ్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం ..

గత కొన్ని నెలలుగా రొయ్య పరిశ్రమ సంక్షోభంలో ఉండడంతో రొయ్య పరిశ్రమలో పనిచేసే మధ్యవర్తులు, కూలీల పరిస్థితి దారుణంగా మారింది. కొన్ని నెలలుగా విదేశీ ఎగుమతులు లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం కొరడా విధించడంతో రొయ్యల పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో కూలీల వద్ద డబ్బులు లేకపోవడంతో సంక్రాంతి కళ తప్పింది.

పెనుమంట్ర: సంక్రాంతి సందర్భంగా నాలుగు రోజుల పాటు జరిగే కోడిపందేల బరుల వద్ద ఈ ఏడాది రెండో రోజు గుండాట ఆపేయడంతో కోడి పకోడీ విక్రయించే దుకాణాదారులకు బేరాలు లేక డీలాపడ్డారు. ముఖ్యంగా మండలంలోని మాముడూరు, జుత్తిగ, నత్తారామేశ్వరం, ఆలమూరు గ్రామాల్లో కోడి పందేలు జరిగినప్పటికీ వాటి ఆవరణలో గుండాటను పోలీసులు ఆపేయడంతో వీటిపై ఆధారపడి ఏర్పాటు చేసిన మాంసం దుకాణదారులు డీలాపడ్డారు. ఏటా సంక్రాంతి పండగ మూడు రోజులు రోజుకు 10 నుండి 12 కేజీల కోడి పకోడీ అమ్మకాలు జరిగేవి. ఈ ఏడాది ఆ పరిస్థితికి భిన్నంగా మారింది. ఒక్కో కోడి రూ.125 హోల్‌సేల్ ధరకు కొనుగోలు చేసి కిలో పకోడీ రూ.500లకు విక్రయిస్తామని వ్యాపారి తెలిపాడు. ఈ ఏడాది గుండాట లేకపోవడంతో వ్యాపారం లేదని వాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎంఎల్‌ఎ తులాభారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మావుళ్లమ్మ అమ్మవారికి మొక్కుబడి తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు దేవస్థానం అధికారులు, పాలకమండలి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ దంపతులు చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ బెల్లంతో తులాభారం నిర్వహించి అమ్మవారికి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని పూజించినట్లు పేర్కొన్నారు. ఏటా రాష్ట్ర స్థాయిలో మావుళ్లమ్మ వారి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాది ఈ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎంఎల్‌ఎ దంపతులతో పాటు ఆయన సోదరులు బాలాజీ దంపతులు, చల్లారావు దంపతులు పాల్గొన్నారు.

దొడ్డనపూడిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు సహకారంతో భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కాళ్ల వైద్యాధికారి డాక్టర్ పి.రమామహేశ్వరి అన్నారు. మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. మొదటి స్థానంలో తులసి నిలిచి బహుమతిగా మైక్రో ఓవెన్, ద్వితీయ స్థానంలో బొడ్డు దుర్గ నిలిచి గ్రైండర్ బహుమతిని అందుకున్నారు. తృతీయ స్థానంలో కొప్పర్తి బాల మాధవి నిలిచి మిక్సీ గెలుపొందింది. కాళ్ల వైద్యాధికారిణి డాక్టర్ రమా మహేశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. మొదటి బహుమతికి రూ. 1500, రెండో బహుమతికి రూ. వెయ్యి, మూడో బహుమతికి రూ. 500 చొప్పున డాక్టర్ పి. మహేశ్వరి ఆర్థిక సాయం అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతిగా వాటర్ బాటిల్ అందించారు. ఈ కార్యక్రమంలో కొల్లిదేవి పద్మజ, కొల్లిభాస్విని, ఉప సర్పంచి నక్కా వీర కృష్ణ పాల్గొన్నారు.


పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు


బహుమతులు అందుకుంటున్న విజేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాలకోడేరులో....

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నో ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులంతా ఒకచోట కలుసుకుని సరదాగా గడిపారు. ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆప్యాయత పంచుకున్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా సోమవారం స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి గురువులను సత్కరించారు. అనంతరం గ్రామంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్.సాయిశ్రీనివాస్, కలిదిండి ఆనందరాజు, గ్రంధి రాజా, కూర్మాల రాజా, బొక్కా సత్యనారాయణ, దంపనబోయిన వెంకటేశ్వరరావు, మీగడ నాగేశ్వరరావు, వెంకటకృష్ణ, మండపాక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండల కేంద్రమైన మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా సమావేశమయ్యారు. 1997-1998 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సమావేశమై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యులను సహచరులకు పరిచయం చేశారు. ఆనాటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. పాఠశాలకు సుమారు 20 వేల విలువైన ప్రింటర్, వీల్‌చైర్‌ను అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరాధంగా గడిపారు. సహపంతి భోజనాలు చేశారు.

మొగల్తూరులో...

మొగల్తూరులో క్షీణించిన పారిశుధ్యం

ఏర్పాటు కాని పక్కా డ్రెయిన్లు
ముందుకు పారని మురుగు
దోమల విజృంభణతో ప్రజలకు అనారోగ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు పంచాయతీల్లో మురుగునీరు పారేందుకు పక్కా డ్రెయిన్లను ఏర్పాటు చేయలేదు. ప్రతిగ్రామంలోనూ పక్కా మురుగు డ్రెయిన్ నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించినా కోవిడ్ ప్రభావంతో అది ఆచరణకు నోచుకోలేదు. దీంతో ప్రజలకు మురుగునీటి కష్టాలు తీరడంలేదు. డ్రెయిన్లు, ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచి పారిశుధ్య క్షీణిస్తోంది. దోమలు విజృంభణతో అనారోగ్యానికి గురవుతామని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అసంపూర్తిగా పక్కా డ్రెయిన్లు

మొగల్తూరులోని పాతకాలువ సెంటరు ప్రాంతంలో సుమారు రెండేళ్ల కిందట రూ.30 లక్షల అంచనాతో పక్కా డ్రెయిన్లు నిర్మాణం చేపట్టారు. 70 శాతం పైబడి నిర్మాణం పూర్తయింది. చేసిన పనులకు నేటికి నిధులు విడుదల కాలేదు. మిగిలిన నిర్మాణం పూర్తి చేసేందుకు పంచాయతీ యంత్రాంగం ముందుకు రాలేదు. దీంతో ఆ నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. నిర్మించిన డ్రెయిన్‌లోకి మురుగునీరు చేరుతుంది. ఆ మురుగు బయటకు వెళ్లేందుకు తగిన నిర్మాణం చేయలేదు. మురుగునీరు నిలువ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగాయి. దోమకాటు ప్రభావంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల మొగల్తూరులో నూతనంగా ఒక వ్యక్తికి ఫైలేరియా సోకిన సంఘటన వెలుగులోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


మొగల్తూరులో మురుగు నిండిన డ్రెయిన్

మొగల్తూరులో నిర్మాణం పూర్తవని మురుగు డ్రెయిను

మరమ్మతుల్లో భూగర్భ డ్రెయిన్

మొగల్తూరు గాంధీ బొమ్మ కూడలి ప్రధాన మార్గంలో ఉన్న భూగర్భ డ్రెయిను పలుచోట్ల మరమ్మతులకు గురైంది. దీని నిర్వహణ కూడా సక్రమంగా లేదు. డ్రెయిన్ల నుంచి మురుగునీరు సక్రమంగా పారడంలేదు. దీంతో వాటినుంచి వెలువడే దుర్వాసన, దోమల పెరుగుదలతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ప్రకటన

In The Court Of The Senior Civil Judge Court : Bhimavaram
I.A.No. 399/2022
I.A.No. 400/2022
I.A.No. 401/2022
in O.S.No. 245/2015

Plaintiff /Petitioner:
Dasetti Appalanarasamma
AND
Respondents /Defendants:
1) Muchi Srinivasa Rao (Died)
2) Muchi Lakshmi, W/o. Late Srinivasa Rao, R/o. Sri Sayana Street, Gunupudi, Bhimavaram, W.G.Dist.
3) Muchi Teja, S/o. Late Srinivasa Rao, R/o. Sri Sayana Street, Gunupudi, Bhimavaram, W.G.Dist.

పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం పిటీషన్ నోటీసులు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్టు ద్వారాను పంపించిననూ, వాటిని మీరు అందుకొని యుండుట లేదు. అందువలన మీరు **ది.18-01-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరుచుకొనవలెను.** అట్లు హాజరు కానిచో మీ పరోక్షంలో సదరు పిటీషనును తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పి.రాజారావు
భీమవరం, పిటీషనరు తరుపు అడ్వకేట్ భీమవరం.
15-1-23. సెల్: 94401 30111

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
I.A.No. 381/2021
O.S.No. 442/2021

Between:
Sri. Thota Musalayya ***...Petitioner /Plaintiff***
AND
Sri. Karri Srinivas ***...Respondent /Defendant***

డిఫెండెంట్:
కర్రి శ్రీనివాస్, తండ్రి: ఆదినారాయణ వయస్సు 65 సం॥లు, వ్యాపారం మరియు వ్యవసాయం, డోర్ నెం. 3-102, చిలకంపాడు (Ch.అగ్రహారం), గణపవరం మండలం.

పై నెంబరు పిటీషనులో వాది ప్రతివాదికి ఎన్నిమార్లు పిటీషను నోటీసు పంపిననూ అమలు కానీ కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పిటీషను నోటీసులు అమలు నిమిత్తం పత్రిక ప్రకటన ద్వారా అమలు చేసే విధముగా ఆర్డరు పొందియున్నారు. కావున పిటీషనులో ఎట్టి ఆక్షేపణ ఉన్న యెడల తెలియజేసుకొనుటకు **ది. 30-01-2023వ తేదీ ఉదయం 10:30 నిముషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని ప్లీడర్ ద్వారా గాని ఆక్షేపణ తెలియజేసుకొనవలెను.** లేని యెడల వారి పరోక్షమందు పిటీషను తదుపరి చర్యలు జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
వాయిదా తేదీ: 30-01-2023
తాడేపల్లిగూడెం, **మద్దా శ్రీనుబాబు**
అడ్వకేటు, తాడేపల్లిగూడెం.
సెల్: 9963739591,7997744888

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No. 442/2021

Between:
Sri. Thota Musalayya ***...Plaintiff***
AND
Sri. Karri Srinivas ***...Defendant***

డిఫెండెంట్:
కర్రి శ్రీనివాస్, తండ్రి: ఆదినారాయణ వయస్సు 65 సం॥లు, వ్యాపారం మరియు వ్యవసాయం, డోర్ నెం. 3-102, చిలకంపాడు (Ch.అగ్రహారం), గణపవరం మండలం.

పై నెంబరు దావాలో వాది ప్రతివాదికి ఎన్నిమార్లు దావా సామాన్లు పంపిననూ అమలు కానీ కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం దావా సామాన్లు అమలు నిమిత్తం పత్రిక ప్రకటన ద్వారా అమలు చేసే విధముగా ఆర్డరు పొందియున్నారు. కావున దావాలో ఎట్టి ఆక్షేపణ ఉన్న యెడల తెలియజేసుకొనుటకు **ది. 30-01-2023వ తేదీ ఉదయం 10:30 నిముషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని ప్లీడర్ ద్వారా గాని ఆక్షేపణ తెలియజేసుకొనవలెను.** లేని యెడల వారి పరోక్షమందు దావా తదుపరి చర్యలు జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
వాయిదా తేదీ: 30-01-2023
తాడేపల్లిగూడెం, **మద్దా శ్రీనుబాబు**
అడ్వకేటు, తాడేపల్లిగూడెం.
సెల్: 9963739591,7997744888

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
తాడేపల్లిగూడెం
ఐ.ఎ.నె. 92/2021
ఇన్ ఓ.ఎస్.నెం. 97/2021

మధ్య:
పిటీషనరు /వాది:
శ్రీ దండమూడి వెంకటేశ్వరరావు
మరియు
రెస్పాండెంటు /ప్రతివాదులు:
శ్రీ దండమూడి రామచంద్రరావు వగైరాలు

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు దండమూడి వెంకటేశ్వరరావు గారు పై ప్రతివాది మరియు నాల్గురివై పై దావా గ్రంథమును సల్పగా అందున మీరు 4వ రెస్పాంటెంటు /ప్రతివాదియైవున్నారనియు సదరు దావా /పిటీషను పరిహారము నిమిత్తము మీకు ఎన్నిమారులు నోటీసు మరియు సమను పంపిననూ మీరు సదరు సర్వీసులను తీసుకొనక కాలహరణం గావించుచున్నారు.

కావున యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు ఖూద్దున గాని విషయ అవగాహన కలిగిన వకీలు ద్వారా **ది.18-01-2023న వచ్చి తరపున తగు కౌంటరు మరియు స్టేటుమెంటులు దాఖలు చేసుకొనగలరు.** అట్లు కాని పక్షమున మీ అభిముఖము లేకనే సదరు దావా గ్రంథమును పరోక్షముగా తీర్పును కావించగలరని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

// కోర్టు వారి ఆదేశము మేర //
వాయిదా తేదీ: 18-01-2023
4వ ప్రతివాది / పిటీషనరు అడ్రసు:
శ్రీ దండమూడి వీర్రాజు, తండ్రి: వీరరాఘవులు, హిందూ, వ్యవసాయం, యింటి నెం. 14-12-8/1, బిషాన్ కటక్, రాయఘుర్ డిస్ట్రిక్ట్, వడిస్సా.

యాళ్ళబండి రామకృష్ణపరమహంస
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 99481 69761